## క్లుప్తంగా

### పోలింగ్ స్టేషన్ల తనిఖీ



పాతకొట్టాం జెడ్పీ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అరుణ్‌కుమార్

**కోటనందూరు:** మండలంలోని పోలింగ్ స్టేషన్లను సోమవారం అధికారులు పరిశీలించారు. కేపీ మల్లవరం, కేఈ అగ్రహారం, పాతకొట్టాం, కొత్తకొట్టాం, కేతు చిన్నయ్యపాలెం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సెక్టోరల్ అధికారి, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో మంచినీరు, మరుగుదొడ్డి, విద్యుత్, దివ్యాంగులు చేరుకునేందుకు ప్లాట్ ఫాం, ఆహ్లాదకర వాతావరణం తదితర సౌకర్యాలు ఉన్నాయా? లేదా? అని పరిశీలించి వివరాలు నమోదు చేశారు. పంచాయతీ కార్యదర్శులు కుశిరెడ్డి అప్పలరాజు, రాజా నాగేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

**ప్రత్తిపాడు:** స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్-ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో సోమవారం విస్తృతంగా దాడులు చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. మండలంలోని శరభవరంలో ఐదు లీటర్ల సారాతో నల్లం శ్రీను, ఒమ్మంగిలో పది లీటర్ల సారాతో కొట్టేటి అప్పలరాజు అనే మహిళను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసి స్థానిక తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ ఎదుట హాజరు పరిచారు. ఈ దాడుల్లో కాకినాడ జిల్లా ఇంటిలిజెన్స్ వింగ్ సీఐ కె.గిరిధర్, ప్రత్తిపాడు సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరం



కిర్లంపూడిలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

**కిర్లంపూడి:** స్థానిక ఏనుగువీధి సెంటర్ వద్ద సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సానా సతీష్‌బాబు ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ ప్రతినిధి కేవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. వైద్యులు సుమారు 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. పలువురిని మెరుగైన వైద్యం కోసం పెద్దాసుపత్రులకు రిఫర్ చేశారు.

### న్యాయవాదుల నిరసన

**ప్రత్తిపాడు:** ప్రభుత్వం అక్టోబర్ 31న ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు వ్యతిరేకంగా సోమవారం ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో న్యాయవాదులు నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టంశెట్టి పుల్లయ్య ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి, కోర్టు ప్రాంగణంలో నిరసన చేపట్టారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు సీహెచ్ పుల్లయ్య మాట్లాడుతూ ఈజీఓ ద్వారా భవిష్యత్తులో హక్కుదారులకు తెలియకుండానే భూమిని కోల్పోవలసి వస్తుందన్నారు. ఇప్పటికే చాలామంది తమ భూహక్కును కోల్పోయినట్టు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈ చట్టాన్ని సవరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఐలాజ్ రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ బుగత శివ, బార్ సభ్యులు ఆకాశం మల్లేశ్వరరావు, బొంగులూరి మధుబాబు, రాయి శ్రీనివాసరావు, బండారు నరసింహారావు, అవసరాల దేవి, రాజాల చిట్టిబాబు, పిల్లి బలరాముడు, ఆకుల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్‌ను పొదుపుగా వాడాలి

**శంఖవరం:** విద్యుత్‌ను వృథా చేయకుండా పొదుపుగా వాడాలని మండల విద్యుత్‌శాఖ అధికారి కుమార్ సూచించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు ఇంధన పొదుపుపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ వరకూ విద్యుత్ పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ప్రతిఒక్కరూ అవసరం మేరకు మాత్రమే ఇళ్లలో లైట్లు వేయాలని, విద్యుత్‌ను పొదుపుగా వాడాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, విద్యుత్ శాఖ సిబ్బంది సత్యనారాయణ, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

### తల్లి ఆస్తిపై కూతుళ్లకు హక్కు కల్పించాలి

**శంఖవరం:** తల్లి ఆస్తిపై కూతుళ్లకు హక్కు కల్పించాలని మండలంలోని జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఈగల పద్మావతి కుమార్తెలు పి.నాగలక్ష్మి, పి.అరుణకుమారి, సీహెచ్ దేవి కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యానికి వినతిపత్రం అందజేశారు. గతంలో తన తల్లి మృతి చెందగా ఆమె పేరు మీద ఉన్న భూమి, ఇళ్లు కొందరు అన్యాక్రాంతం చేస్తున్నారన్నారు. తమకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు.

# రారండోయ్.. ఆటాడేద్దాం

- ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు సర్వం సిద్ధం
- ముగిసిన క్రీడాకారుల రిజిస్ట్రేషన్లు
- ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 14 వరకూ పోటీలు
- నియోజకవర్గంలో 22,357 మంది క్రీడాకారుల నమోదు

గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించి వారిని జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనిలో భాగంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడానికి సర్వం సిద్ధం చేసింది. ఆదరణ కరువై, ఎంతోమంది క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునే అవకాశాలను కోల్పోతున్నారు. అలాంటి వారిని ప్రోత్సహించడంతో పాటు మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతారు. కాగా గ్రామాల్లోని ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఇప్పటికే తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ నెల 26 నుంచి అన్ని సచివాలయాల పరిధిలో ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్:** ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాలకు వరకూ ఆటలను ప్రోత్సహిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించేలా చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్ర క్రీడలకు శ్రీకారం చుట్టింది.

**వాడవాడలా క్రీడా పండగ**

రూ.కోట్లు వెచ్చించి 51 రోజుల పాటు వాడవాడలా క్రీడా పండగను నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. అన్ని గ్రామాల్లోనూ షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, కబడ్డీ తదితర క్రీడా పోటీలను స్త్రీ, పురుషుల విభాగాల్లో వేర్వేరుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకూ ఈ పోటీలు నిర్వహిస్తారు. సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఈ పోటీలు జరుగుతాయి.

**ప్రతిభ ఉంటే రాష్ట్ర స్థాయి వరకూ..**

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని 83 సచివాలయాల పరిధిలో ఈ పోటీలు నిర్వహిస్తారు. తొలుత సచివాలయ స్థాయిలో స్త్రీ, పురుష విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయి. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులతో గ్రామ స్థాయిలో జట్లను సిద్ధం చేస్తారు. ఈ జట్లు మండల స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. మండల స్థాయిలో విజేత జట్లు నియోజకవర్గ స్థాయిలో, నియోజకవర్గం స్థాయిలో విజేత జట్లు జిల్లా స్థాయి పోటీల్లో తలపడతాయి. జిల్లా స్థాయి విజేత జట్టుకు రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడే అవకాశం కల్పిస్తారు.

**రిజిస్ట్రేషన్లు పూర్తి**

నియోజకవర్గంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు సచివాలయాల్లో గత నెల 27వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించారు. రిజిస్ట్రేషన్ చివరి రోజు ఈ నెల 17వ తేదీ గడువు ముగిసే సమయానికి ఆసక్తి కలిగిన 15 సంవత్సరాల దాటిన 14,526 మంది యువకులు, 7,831 మంది యువతులు వెరసి 22,357 మంది తమ పేర్లను రిజిస్టర్ చేయించుకున్నారు. కాకినాడ జిల్లాలోనే అత్యధికంగా ప్రత్తిపాడు మండలంలో 7,834 మంది నమోదు చేసుకోగా, రౌతులపూడి మండలంలో 4,518 మందితో రెండో స్థానంలో ఉంది. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడా పరికరాలు జిల్లా కేంద్రం నుంచి సచివాలయాలకు చేరుకున్నాయి. వాటిని పంపిణీ చేసే పనిలో సచివాలయ సిబ్బంది నిమగ్నమయ్యారు.



ప్రత్తిపాడులో క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న అధికారులు



ధర్మవరం జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానం

**ఆహ్లాదకర వాతావరణంలో క్రీడలు**



ఆహ్లాదకర వాతావరణంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలి. మండలంలో 7743 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. పోటీలకు అవసరమైన క్రీడా సామగ్రిని ఇప్పటికే గ్రామాలకు చేరవేశాం.

– ఎంవీఆర్ బాబు, ఎంపీడీఓ, ప్రత్తిపాడు

**నియోజకవర్గంలో రిజిస్ట్రేషన్ల వివరాలు**

| మండలం | క్రికెట్ | బాడ్మింటన్ | వాలీబాల్ | కబడ్డీ | ఖోఖో | నాన్ కాంపిటేటివ్ |
|---|---|---|---|---|---|---|
| ప్రత్తిపాడు | 2,943 | 671 | 1,759 | 2,138 | 1,799 | 4,384 |
| రౌతులపూడి | 2,025 | 387 | 1,404 | 1,561 | 1,490 | 1,915 |
| శంఖవరం | 1,821 | 498 | 1,221 | 1,137 | 1,136 | 1,588 |
| ఏలేశ్వరం | 2,247 | 580 | 1,148 | 1,615 | 1,187 | 1,455 |
| మొత్తం | 9,067 | 2,136 | 5,532 | 6,451 | 5,612 | 9,342 |

**విజేతలకు నగదు ప్రోత్సాహకాలు**

బాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.35 వేలు, రూ.15 వేలు, రూ.5 వేలు, క్రికెట్‌కు రూ.50 వేల వంతున నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు రూ. 60 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షల వంతున అందజేస్తారు.

### తేటగుంటలో వై ఏపీ నీడ్స్ జగన్



తేటగుంటలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**తుని రూరల్:** మండలంలోని తేటగుంటలో సోమవారం సర్పంచ్ అత్తి నాగరాజు అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. మెయిన్ సెంటర్‌లో పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఇంటింటా పర్యటించి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. వైస్ సర్పంచ్ పోతుల పెదకాపు, నాయకులు గణేసుల వీరబాబు, వీఆర్వో వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

### పేదలకు మేలు జరగాలంటే జగన్ మళ్లీ సీఎం కావాలి

**తొండంగి:** పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మండలంలోని వేమవరంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ మండల కన్వీనర్ బద్దిసూకరాజు, పార్టీనాయకులు అంగుళూరి సుశీలరాణి, మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, ఎంపీటీసీ కఠారి లక్ష్మణ్‌కుమార్, యనమల పంపా ప్రవీణ్, సర్పంచ్‌లు కోడా వర్మ, మారేటి కృష్ణ, నేమాల దేవుడు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యం



తునిలో సీఎం జగన్ ప్రసంగాన్ని తిలకిస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధారాణి, అధికారులు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంపీపీ, తదితరులు

**గండేపల్లి:** గ్రామాల్లో పేదలకు పైసా ఖర్చు లేకుండా మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ చలగళ్ల దొరబాబు తెలిపారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ పెంచిన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మండలం నుంచి ఎంపీపీ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, ఎంపీడీఓ రామన్, ఈఓపీఆర్డీ మూర్తి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఆరోగ్యశ్రీతో పేదలకు మేలు**

**తుని:** ఆరోగ్యశ్రీ పథకంతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని మున్సిపల్ చైర్మన్ ఏలూరి సుధారాణి అన్నారు. ఆరోగ్యశ్రీ వైద్యం ఖర్చు పరిమితి రూ. 25 లక్షలకు పెంపు సందర్భంగా సీఎం జగన్ ప్రసంగాన్ని సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సుధారాణి, పట్టణ సీఐ గీతారామకృష్ణ, పీహెచ్‌సీ డాక్టర్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. ఆరోగ్యశ్రీ ఖర్చు పెంపు పట్ల హర్షం వ్యక్తం చేశారు. వైద్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**సీఎం జగన్ ప్రసంగం వీక్షణ**

**కోటనందూరు:** ఆరోగ్యశ్రీ ఖర్చుల పరిమితి పెంపు కార్యక్రమంలో సీఎం జగన్ ప్రసంగాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు తిలకించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, పలువురు ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది తిలకించారు. ఆరోగ్య శ్రీ పథకం నగటు పేదవాడికి సంజీవని లాంటిదని ఎంపీపీ అన్నారు.

# ఘనంగా విగ్రహాల ఆవిష్కరణ



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న వినోద్‌మిశ్రా పార్టీ శ్రేణులు

**ఏలేశ్వరం:** పట్టణంలోని వినోద్‌మిశ్రా నగర్‌లో సోమవారం కామ్రేడ్ వినోద్ మిశ్రా, అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. వినోద్ మిశ్రా వర్ధంతిని పురస్కరించుకుని సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో విగ్రహాలను ఆవిష్కరించారు. తొలుత పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కొమ్ములాట, గిరిజన నృత్యం, తీన్‌మార్, డప్పుమేళం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వినోద్ మిశ్రాకు ఘన నివాళులు**

**జగ్గంపేట:** మండలంలోని గోవిందపురంలో సోమవారం సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ, గిరిజన సంఘం ఆధ్వర్యంలో వినోద్ మిశ్రా వర్ధంతి నిర్వహించారు. తొలుత వినోద్ మిశ్రా చిత్రపటానికి లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు పూలమాల వేసి నివాళులర్పించారు. వినోద్ మిశ్రా సేవలను కొనియాడారు. లిబరేషన్ పార్టీ నాయకులు జక్కంపూడి రాజు, రమణ, చిన్నబ్బు, సంకురమ్మ, మరిడమ్మ పాల్గొన్నారు.

**ప్రత్తిపాడు:** మండలంలోని లంపకలోవలో సోమవారం సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ సీనియర్ నాయకుడు వినోద్ మిశ్రా వర్ధంతి నిర్వహించారు. వినోద్ మిశ్రా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లిబరేషన్ పార్టీ పతాకాన్ని రాజాల ఏసురత్నం ఆవిష్కరించారు. కార్యక్రమంలో లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, జిల్లా గిరిజన సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్యరాముని అక్షతల పంపిణీ

**గోకవరం:** అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని అయోధ్య నుంచి వచ్చిన రాముని అక్షతలు, కరపత్రాలను సోమవారం ప్రజలకు పంపిణీ చేశారు. స్థానిక దాసరి వారి రామాలయం వద్ద విశ్వహిందూ పరిషత్ రాజమహేంద్రవరం జిల్లా ప్రచార ప్రముఖ్ ఉంగరాల ఆదివిష్ణు ఆధ్వర్యంలో ప్రతి గ్రామం నుంచి వచ్చిన కార్యకర్తలకు వీటిని అందజేశారు. జనవరి 5వ తేదీ నాటికి ప్రతి ఇంటికి పంపిణీ చేయాలని సూచించారు. హిందూ ధర్మంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో బద్దిరెడి అవతార్‌బాబా, వరసాల ప్రసాద్, బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), కొత్తపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

**తొండంగి:** మండలంలోని పెరుమాళ్లపురంలో రూ.2 కోట్లతో సీసీ రోడ్లు నిర్మాణానికి వైస్ ఎంపీపీ నాగం గంగబాబు సోమవారం భూమిపూజ చేశారు. పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో 2 కిలో మీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణానికి అరబిందో ఫార్మా ఫౌండేషన్ రూ.2 కోట్లు కేటాయించింది. ఈ మేరకు వైస్ ఎంపీపీ నాగం గంగబాబు పార్టీ నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, పార్టీ నాయకులు గంగిరి అడివియ్య, కొయ్యా కొండలరావు, యాదాల చక్రి, అరబిందో ఫార్మా ఫౌండేషన్ మేనేజర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# శరవణ భవ..!



ప్రత్యేక అలంకరణలో తాళ్లూరు వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు సోమవారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామాల్లోని ఆలయ కమిటీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు పాలు, పులిహోర, ప్రసాదం పంపిణీ చేశారు.

- వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠ మహోత్సవాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

**ఏలేశ్వరం:** స్థానిక సాయిబాబా మెట్ట వద్ద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. రాత్రికి ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మండలంలోని యర్రవరం, లింగంపర్తి తదితర గ్రామాల్లో సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు ఘనంగా జరిగాయి.

**ప్రత్తిపాడు:** స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు కొత్తలంక సాయి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసదాలు స్వీకరించారు.

**గండేపల్లి:** మండలంలోని తాళ్లూరులో వేంచేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దర్శనానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి స్వామివారి దివ్యకల్యాణం కన్నుల పండుగగా జరిగింది. ఉప్పలపాడు, నీలాద్రిరావుపేట, యల్లమిల్లి, నాయకంపల్లి, మురారి, సింగరంపాలెం, తదితర గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు.

**ప్రత్తిపాడు రూరల్:** మండలంలోని గజ్జనపూడిలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్ఠి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సర్వదర్శనం, ఊయాల సేవ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి దర్శించి మొక్కులు చెల్లించారు. పుట్టకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమరాధన నిర్వహించారు. దాత జీఎస్ రంగాచార్యులు, అనంతలక్ష్మి దంపతులు ఆలయానికి రూ.20 వేలు విలువ చేసే కంచు గంటను సమర్పించారు.

**వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం**



గజ్జనపూడిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

**తొండంగి:** అన్నవరంలో సుబ్రహ్మణ్య షష్ఠ వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. పండితులు స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం హైస్కూల్ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదిక వద్దకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీపై ఊరేగింపుగా తీసుకొచ్చి ఆశీనులను చేశారు. ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తం స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

**తుని రూరల్:** కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో వేద పండితులు, వేద విద్యార్థులు సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోవ దేవస్థానంలో పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. ఎస్.అన్నవరం, టి.తిమ్మాపురం, హంసవరం, తేటగుంట, డి.పోలవరం, తదితర గ్రామాల్లో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆలయాలకు భక్తులు పోటెత్తారు.



అన్నవరంలో స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

**శంఖవరం:** మండలంలోని కత్తిపూడి, శంఖవరం గ్రామాల్లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ శంఖవరంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు స్వామివారి చిత్రపటం అందజేశారు. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు.

**కిర్లంపూడి:** మండలంలోని కృష్ణవరం, రామచంద్రపురం, రాజుపాలెం, చిల్లంగి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

**గోకవరం:** గుమ్మళ్లదొడ్డి గ్రామంలో సుందరగిరి కొండపై వేంచేసిన శ్రీవల్లీదేవసేవ సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి తెల్లవారుజాము నుంచి భక్తులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి కల్యాణం జరిపారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కొత్తపల్లి రాజుగారితోటలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.



కుమ్మరిలోవ ఆశ్రమంలో స్వామివారికి పూజలు చేస్తున్న పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి



ఏలేశ్వరంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



ప్రత్తిపాడులో స్వామివారికి సామూహిక పూజలు చేస్తున్న భక్తులు

### సత్యదేవుని దర్శించిన దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ



ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాల వలవన్‌కు సత్యదేవుని చిత్రపటం అందజేస్తున్న ఈఓ శ్రీనివాసమూర్తి

**తొండంగి:** దేవదాయ, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఐఏఎస్ అధికారి ఆర్.కరికాల వలవన్ కుటుంబ సమేతంగా సోమవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. దేవస్థానానికి వచ్చిన ఆయనకు పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సత్యదేవుని దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేయగా దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి సత్యదేవుని ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు.

### భవిత కేంద్రం పరిశీలన



తొండంగి భవిత కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు

**తొండంగి:** స్థానిక భవిత కేంద్రాన్ని ఐఈఆర్టీ కో ఆర్డినేటర్ సీహెచ్ నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. భవిత కేంద్రంలో రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పిల్లలకు మెరుగైన విద్యతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహాలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఐఈఆర్టీ వలంటీర్లు ఉన్నారు.